సాక్షి
కామారెడ్డి
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



సోయాకు వైరస్ దెబ్బ

ఇన్నాళ్లూ కళకళలాడిన సోయా పంట.. వైరస్‌తో దెబ్బతింటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸



ముట్టడి ఉద్రిక్తం

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.3 /22.8

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

23న డెయిరీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాలలో ఈనెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ శరత్‌చంద్ర తెలిపారు. కళాశాలలో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారికి 8 సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఇంటర్ ఎంపీసీ చదివినవారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లోగాని, 95335 70957 నంబర్‌లోగాని సంప్రదించాలని సూచించారు.

24 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: ఉచిత బియ్యం పంపిణీ ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రేషన్ బియ్యం తీసుకోని వారు సమీపంలోని రేషన్ షాపులకు వెళ్లి బియ్యం తీసుకోవాలని సూచించారు.

‘22 ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి’



కామారెడ్డి టౌన్: కాళేశ్వరం ప్రాజెక్ట్ 21, 22వ ప్యాకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కామారెడ్డి జల సాధన సమితి కన్వీనర్ జగన్నాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ప్యాకేజీలకు సంబంధించిన పనులు తొమ్మిదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. జిల్లా తాగు, సాగునీటి సమస్యలు తీరేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 28న జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాలు, మేధావులు, రైతుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జల సాధన సమితి నాయకులు కొత్తపల్లి మల్లయ్య, వీఎల్ నర్సింహారెడ్డి, హన్మండ్లు, సాప శివరాములు, కుంబాల లక్ష్మణ్, శ్రీనివాస్, అనిల్, నాగరాజు పాల్గొన్నారు.

‘స్వయం ప్రతిపత్తితో నవశకం’



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడంతో నవశకం ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య పేర్కొన్నారు. బుధవారం కళాశాల చింతల బాలరాజ్ గౌడ్ ఆడిటోరియంలో కొత్త విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా ప్రవేశపెట్టిన ఉపాధి ఆధారిత కోర్సులైన బీఎస్సీ ఆనర్స్, బీబీఏ కోర్సులతో పాటు ఆర్ట్స్, సైన్స్ కోర్సుల్లో ఇప్పటివరకు 750 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారన్నారు. క్రమశిక్షణతో చదివి, ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అకడమిక్ కోఆర్డినేటర్ శంకర్, వివిధ విభాగాల అధిపతులు రామకృష్ణ, రామస్వామి, వెంకటేశ్వర్లు, లక్ష్మణాచారి, శారద, ఫర్హీన్ ఫాతిమ, రాములు, శివకుమార్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్..






పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువజన సంఘాల మండపాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సంబంధించి ‘సాక్షి’ సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్ నం..
96039 39111

వణికిస్తున్న విష జ్వరాలు..

జిల్లావాసులను విష జ్వరాలు వణికిస్తున్నాయి. జ్వరాలతో ఇంటికొకరు మంచం పడుతున్నారు. డెంగీ వ్యాధితో మరణాలూ సంభవిస్తున్నాయి. పట్టణాలలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారినా అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ భయపెడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



కామారెడ్డి టౌన్: జిల్లాలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పక్షం రోజులుగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. డెంగీ సోకుతుండడంతో ప్లేట్‌లెట్లు పడిపోయి పలువురు మృత్యువాతపడ్డారు. జిల్లాలో ఈ సీజన్‌లో 15 కేసులు మాత్రమే నమోదయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. అయితే జిల్లాలో వందకుపైనే డెంగీ కేసులు నమోదయ్యాయని తెలుస్తోంది.

స్పందన కరువు..

జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీ, రాజీవ్‌నగర్‌కాలనీ, హరిజనవాడ, బతుకమ్మకుంట, రుక్మిణికుంట తదితర కాలనీలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. ఆయా ప్రాంతాలలో ఓపెన్ స్థలాలు, మురికికాలువలు, కుంటలు ఉన్నాయి. టీచర్స్ కాలనీలో ఎక్కడ చూసిన చెత్తకుప్పలు, అధ్వానంగా మారిన మురికికాలువలు దర్శనమిస్తున్నాయి. దీంతో దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలను వ్యాధుల బారిన పడేస్తున్నాయి. అయినా బల్దియా ఆధ్వర్యంలో దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సైతం విషజ్వరాలు సోకి, డెంగీ ప్రబలుతున్నా పట్టణంలో ఎలాంటి సర్వే చేపట్టడం లేదు. దీంతో వ్యాధులు ప్రబలి, ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు ప్రభుత్వ ఆస్పత్రులలోనూ ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది.



ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో బారులు తీరిన రోగులు

విషమించి ప్రాణాలుపోతున్నా..

రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన సౌందర్య, అన్వేష్‌ల 11 నెలల కుమారుడు ఆద్యంత్ ఈనెల 16న డెంగీతో మరణించాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వారం రోజులు చికిత్స అందించినా.. ప్లేట్స్‌లెట్స్ పడిపోవడంతో మృత్యువాతపడ్డాడు. 10 రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని హరిజనవాడకు చెందిన ఏడేళ్ల బాలుడు సైతం డెంగీతో మృతి చెందాడు. ఇలా ఎంతోమంది డెంగీతో బాధపడుతూ మృతి చెందుతున్నా.. అధికారులు మాత్రం అవి డెంగీ కేసులు కాదని వాదిస్తుండడం గమనార్హం.



బాన్సువాడ ఆస్పత్రికి వచ్చిన రోగులు

బాన్సువాడ బల్దియాలో..

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో ఇంటికొకరు సుస్తీ అయ్యారు. కొన్ని కాలనీల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న మురికి నీరు దోమలకు ఆవాసంగా మారింది. పట్టణంలో దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు మంచాన పడుతున్నారు. దగ్గు, జ్వరం, జలుబుతోపాటు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. టీచర్స్ కాలనీ, హర్షత్‌కాలనీ, మదీనా కాలనీ, దాల్‌మల్‌గుట్ట, దళితవాడ, సంగమేశ్వర కాలనీ, ఇస్లాంపురా తదితర కాలనీలలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆయా కాలనీలనుంచి రోగుల తాకిడి ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి నిత్యం 400 నుంచి 450 మంది వివిధ రకాల జ్వరాలు, జలుబు, దగ్గు, దమ్ముతో బాధపడుతున్నవారు వస్తున్నారని వైద్యులు తెలిపారు. పిల్లల వార్డులో 25 బెడ్లు ఉంటే నిత్యం 70 నుంచి 80 మంది పిల్లలు వస్తున్నారన్నారు. పిల్లలు ఎక్కువగా శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రైవేట్ క్లినిక్‌లు కూడా కిటకిటలాడుతున్నాయి. మున్సిపల్ అధికారులు, గ్రామ పంచాయతీల అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా వైద్యశాఖ ప్రకటించిన డెంగీ కేసుల వివరాలు..

2021	2022	2023
44	32	15

ఎల్లారెడ్డి బల్దియాలో..

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని బీడీ కాలనీలో రోడ్డుపై మురికి నీరు పారుతుండడంతో పాటు మురికి నీటి గుంతలు ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. లింగారెడ్డిపేట కాలనీలో ఇళ్ల మధ్యలో మురికి నీటి గుంతలు ఉండడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మున్సిపాలిటీ సిబ్బంది సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా మోడల్ స్కూల్ పక్కన పడేస్తున్నారు. దీంతో దుర్గంధం వ్యాపిస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడం, మురికి కాలువల్లో నీరు నిల్వ ఉంటుండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి గతంలో రోజూ 150 మంది వరకు ఔట్ పేషెంట్లు వచ్చేవారు. ప్రస్తుతం 350 నుంచి 400 మంది వరకు ఆస్పత్రికి వస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెలలో డెంగీ కేసులు నమోదు కాలేదని వైద్యులు తెలిపారు. మలేరియా 172, టైఫాయిడ్ 162 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ పక్కన పడేసిన చెత్త



జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో పేరుకుపోయిన చెత్త, నిల్వ ఉన్న మురికినీరు



కామారెడ్డి రాజీవ్‌నగర్ కాలనీలో మురుగు నీటితో నిండిన కుంట

‘రాజకీయ పార్టీల పాత్ర కీలకం’

కామారెడ్డి క్రైం: స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19తో ఓటరు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసిందన్నారు. వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరిపి 28వ తేదీలోగా పూర్తిస్థాయి నివేదిక రూపొందిస్తామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ ఏజెంట్లను నియమించి బూత్ స్థాయి అధికారులతో కలిసి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎక్కడైనా పొరపాట్లు కనిపిస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఖాసిం అలీ, మాలోత్ హరిలాల్, మహమ్మద్ జఫర్ ఖాన్, బాలరాజు, తమ్మడి స్వామి, దుబ్బాక నవీన్, నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, అనిల్ కుమార్, ఎన్నికల సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

అర్హులందరికీ రుణ మాఫీ లబ్ధి

● సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: అర్హులైన ప్రతి రైతుకు పంట రుణం మాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లతో రుణమాఫీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష రూపాయలలోపు రుణమాఫీకి సంబంధించిన నిధులను బ్యాంకులలో జమ చేశామన్నారు. అవసరమైన ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ భూములలో నివాసం ఏర్పాటు చేసుకున్న అర్హులైన 58 మంది భూములను క్రమబద్ధీకరించామన్నారు. జీవో 59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి నోటీసులు ఇచ్చామన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ రుసుము చెల్లించిన వారి భూముల క్రమబద్ధీకరణకు చర్యలు చేపడుతున్నామన్నారు. గృహలక్ష్మి పథకానికి అర్హులను గుర్తిస్తున్నామన్నారు. జిల్లాలో లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్‌పామ్ సాగవుతోందన్నారు. సంపద వనాల కింద మొక్కలు నాటేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వీసీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాయింట్ల కోసం పక్కదారి

● టీచర్ల పదోన్నతులు, బదిలీలలో అక్రమాలు
● నకిలీ సర్టిఫికెట్లతో దరఖాస్తులు
● క్షుణ్ణంగా పరిశీలించాలని అర్హుల డిమాండ్

కామారెడ్డి టౌన్: విద్యాబుద్ధులు చెప్పాల్సినవారే పక్కదారి పడుతున్నారు. కోరుకున్న స్థానానికి బదిలీ చేయించుకోవడం కోసం అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో తమకు అన్యాయం జరుగుతుందేమోనని అర్హులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో 4,938 ఉపాధ్యాయ పోస్టులుండగా 4,078 మంది టీచర్లున్నారు. 3,333 మంది ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 50 మంది పీజీహెచ్‌ఎంలను బదిలీ చేశారు. ఇంకా 124 హెచ్‌ఎం పోస్టులు ఖాళీలుగా ఉన్నట్లు ప్రకటించారు. కాగా బదిలీలు, పదోన్నతుల కోసం కేటగిరీల వారీగా ఉపాధ్యాయులకు పాయింట్‌లను కేటాయిస్తారు. ఈ పాయింట్ల ఆధారంగా ప్రాధాన్యత ఉంటుంది. ఈ పాయింట్ల కోసమే కొందరు ఉపాధ్యాయులు పక్కదారి పట్టి, నకిలీ సర్టిఫికెట్లను సమర్పించినట్లు తెలుస్తోంది.

మచ్చుకు కొన్ని..

■ సదాశివనగర్ మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు అర్హత లేకున్నా స్పౌజ్ పాయింట్స్ కోసం నకిలీ సర్టిఫికెట్స్‌తో దరఖాస్తు చేసుకున్నారు. ఆమె భర్త ఇంతకుముందే స్పౌజ్ పాయింట్స్ వినియోగించుకుని నిజామాబాద్ జిల్లానుంచి నుంచి కామారెడ్డికి వచ్చారు. దరఖాస్తుల పరిశీలన సందర్భంగా ఈ దంపతుల సర్వీస్ బుక్స్ తీసుకురావాల్సిందిగా విద్యాశాఖ అధికారులు కోరినా.. వారు స్పందించడం లేదని తెలిసింది.

■ ఓ టీచర్ ఓపెన్ హార్ట్ సర్జరీ అయ్యిందంటూ గైనకాలజిస్టు ధ్రువీకరణ పత్రం సమర్పించారు.

■ హిందీ టీచర్ ఒకరు స్పౌజ్ కేటగిరీలో గతంలోనే బదిలీ అయినా ఇప్పుడు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు.

■ జిల్లా కేంద్రంలో పనిచేసే ఓ టీచర్‌కు విడాకులయ్యాయి. ఆమె మరో పెళ్లి కూడా చేసుకున్నారు. అయితే ఒంటరి మహిళనంటూ ఆమె బదిలీకి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

■ దోమకొండ మండలంలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్ ఒకరికి గతంలో 40 శాతం అంగవైకల్యం ఉండగా.. ఈసారి 70 శాతం ఉన్నట్లు సర్టిఫికెట్ జత చేశారు. జిల్లాకేంద్రంలో పనిచేసే మరో ఉపాధ్యాయుడూ ఇలాగే 70 శాతం వైకల్యం ఉన్నట్లు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారు. బీబీపేట మండలానికి చెందిన ఓ టీచర్ సైతం నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తెలిసింది. నిజాంసాగర్ మండలంలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడూ 70 శాతం వైకల్యం ఉన్నట్లు నకిలీ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకున్నారు.

■ కొందరు ఉపాధ్యాయులు న్యూరో సర్జరీ కాకున్నా అయినట్లు సర్టిఫికెట్‌లు సమర్పించారు.

మేనేజ్ చేసుకుంటూ..

■ కొందరు ఉపాధ్యాయులు మెడికల్ బోర్డులో మేనేజ్ చేసుకుని అక్రమంగా సర్టిఫికెట్లు పొందుతున్నట్లు తెలుస్తోంది. ఓ వైద్యాధికారిణి కొందరు ఉపాధ్యాయులకు ఇలా నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామన్న విద్యాశాఖ అధికారుల మాట ప్రకటనలకే పరిమితమైందని అర్హులైన ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ పూర్తి చేయాలన్న సాకుతో అక్రమాలకు తావిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



చర్యలు తీసుకుంటాం



ఉపాధ్యాయులు నకిలీ సర్టిఫికెట్లను సమర్పించినట్లు తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం. బదిలీలు, పదోన్నతల దరఖాస్తులపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే నేరుగా దరఖాస్తు చేసుకోవాలి.

– ఎస్.రాజు, డీఈవో, కామారెడ్డి

‘మత్స్యకారులకు సర్కారు చేయూత’

నస్రుల్లాబాద్: మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి సర్కారు చర్యలు తీసుకుంటోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దుర్కి పెద్ద చెరువులో 90 వేల చేప విత్తనాలను వదిలారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను అందిస్తున్నామన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 69 చెరువులలో 32 లక్షల చేప పిల్లను వదిలామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్, ఆర్డీవో భుజంగరావు, రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ మల్లయ్య, జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ దొబ్బల గంగాధర్, బీఆర్‌ఎస్ నాయకులు పెర్క శ్రీనివాస్, దివిటి శ్రీనివాస్ యాదవ్, కిషోర్ యాదవ్, ప్రతాప్, మహేష్, ప్రభాకర్ రెడ్డి, మాజిద్ ఖాన్, కంది మల్లేష్, శంకర్‌యాదవ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



దుర్కి చెరువులో చేప పిల్లలు వదులుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార
● జిల్లా కేంద్రంలో సంబురాలు

కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. బుధవారం భారతీయ జనత మహిళా మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా కార్యాలయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టినందుకు పీఎం మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజకీయాల్లో మహిళల ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సంధ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదమ్మ, కౌన్సిలర్ మానస, నాయకులు పద్మ, స్వరూప, బాలమణి, హారిక, సుశీల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

దీన్ దయాళ్ స్పర్శ్ పరీక్షలు వాయిదా

నిజామాబాద్ సిటీ: తపాలా శాఖలో ఫిలాటలీ ఖాతా ఉన్న విద్యార్థులకు ఈ నెల 24న నిర్వహించనున్న దీన్ దయాళ్ స్పర్శ్ పరీక్షను అక్టోబర్ 1కి వాయిదా వేసినట్లు తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెలా 22 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు విషయాన్ని గమనించాలని కోరారు.

నాలుగు దుకాణాలు సీజ్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పాత బస్టాండ్‌లో ఉన్న ఫ్రూట్ మార్కెట్ దుకాణ సముదాయాల్లో నాలుగు దుకాణాలను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ సీజ్ చేశారు. ఫ్రూట్ దుకాణాలకు కేటాయించిన దుకాణాలను లబ్ధిదారులు సబ్ లీజ్‌కు ఇచ్చి వేరే దుకాణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియలో పాల్గొని దుకాణాలను పొందిన లబ్ధిదారులు మాత్రమే దుకాణాలు నిర్వహించాలన్నారు. ఇతరులకు సబ్ లీజ్‌కు ఇవ్వరాదవని, కేవలం పండ్ల దుకాణాలు మాత్రమే ఏర్పాటు చేయాలని సూచించారు. బల్దియా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి యోగా స్టేట్‌మీట్‌కు కస్తూర్బా విద్యార్థినులు

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరేపల్లి స్టేజీ వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు రాష్ట్ర స్థాయి యోగ మీట్‌కు ఎంపికై నట్లు కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిణి మైసకల, పీఈటీ గౌమతి తెలిపారు. కామారెడ్డిలో బుధవారం నిర్వహించిన యోగ మీట్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. జూనియర్స్ విభాగంలో ఐశ్వర్య, సహస్ర, సబ్ జూనియర్స్ విభాగంలో సింధూజ, సరస్వతి ఎంపికైనట్లు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

కామారెడ్డి టౌన్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్పీ, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు చేపడుతున్న నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం చేపట్టిన ఈ నిరసన దీక్షలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు పద్మారావు, బాలరాజ్, దాకయ్య ఉన్నారు.

తానా కవయిత్రుల సమ్మేళనానికి స్రవంతి

పిట్లం(జుక్కల్): తానా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నారీ సాహిత్య భేరీ అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనం కార్యక్రమానికి పిట్లం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సాయి స్రవంతి జాదవ్ ఆహ్వానం లభించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం స్రవంతి జాదవ్ సాక్షితో మాట్లాడుతూ.. తానా నిర్వహిస్తున్న కార్యక్రమంలో కవిత్వం వినిపించటానికి తనకు విశిష్టమైన స్థానాన్ని కల్పించినందుకు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్, సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు. సాయి స్రవంతి జాదవ్ ఉపాధ్యాయురాలిగా, సాహిత్య రంగంలో ఎన్నో సన్మానాలతో పాటు మూడు సార్లు జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. కవయిత్రిగా అనేక విభిన్న కవితలు, పద్యాలు, కథలు రాశారు.

సమయపాలన పాటించాలి

తెయూ(డిచ్‌పల్లి): అధ్యాపకులు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని, సమయపాలన పాటించాలని టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి సూచించారు. బుధవారం టీయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో పలు విభాగాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో బోధనా తీరును పరిశీలించారు. మాస్ కమ్యూనికేషన్ కంప్యూటర్ ల్యాబ్‌ను, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ ల్యాబ్‌లను, బోటనీ, బయోటెక్నాలజీ ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ప్రతి ల్యాబ్‌లో ఉన్న పరికరాలు, కెమికల్స్ విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా చూడాలని సూచించారు.

సోయాకు వింత వైరస్ దెబ్బ

- అన్ని గ్రామాలకు పాకుతున్న వైరస్
- కాపాడుకోవడానికి రైతుల తంటాలు



కోడిచిర శివారులో వైరస్‌తో పూర్తిగా ఎండిపోయిన సోయా పంట



పెద్ద తడ్గూర్ శివారులో..

మద్నూర్(జుక్కల్): సోయా పంట కళకళలాడుతుందని ఇన్ని రోజులు సంతోష పడిన రైతులు ప్రస్తుతం ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కోడిచిర, పెద్ద తడ్గూర్, చిన్న తడ్గూర్, శేఖాపూర్, సుల్తాన్‌పేట్, లచ్చన్ శివారులలోని సోయాబీన్ పంటకు వింత వైరస్ సోకడంతో పంట పూర్తిగా ఎండిపోతోందని రైతులు లబోదిబోమంటున్నారు. సోయా పంట ప్రస్తుతం 70 రోజుల పంట. పంటకు భారీగా కాత ఉండి దట్టంగా కాయలు సైతం కాశాయని రైతులు పేర్కొన్నారు. వారం రోజుల నుంచి ఏమైందో ఏమో పంట పూర్తిగా ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. సోయా కాండానికి ఉన్న కాయలు ఎండిపోయి రాలిపోతున్నాయని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కాండం లోపల తెగుళ్లు ఆశించడంతో ఆకు పచ్చగా ఉన్న పంట ఎండిపోతుందని, మరో నెల రోజుల్లో చేతికి వచ్చే సోయా పంట దెబ్బతింటుండడంతో రైతులు రోదిస్తున్నారు. మొదట నాలుగైదు సోయా దంట్లకు వైరస్ ఆశించి ఆ తర్వాత చేను మొత్తం వ్యాపించి పంట ఎండిపోతుందన్నారు. మండలంలో 30 వేల ఎకరాల్లో సోయా సాగైంది. అధిక వర్షాలతో పాటు ఎలాంటి వాతావరణాన్నైనా తట్టుకునే గుణం ఉన్న సోయా పంట వేసినా నష్టం తప్పేటట్టు లేదని వారు తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే కనీసం పెట్టుబడులైనా వచ్చేటట్టు కనిపించడం లేదని మదనపడుతున్నారు. ఈ వైరస్ మండలం మొత్తం వ్యాపించక ముందే వ్యవసాయ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వింత రోగం వచ్చింది



నేను 10 ఎకరాల్లో సోయాబీన్ పంట వేసిన. పంట బాగా పెరిగింది. నడుము ఎత్తు పెరిగి బాగా కాయ లు కాశాయి. ఏమైందో ఏమో తెలవదు దంటుకు రోగం వచ్చింది. కాయలు మొత్తం ఎండిపోయి పడిపోతున్నాయి. సోయా బీన్ పంటకు గతంలో ఎన్నడూలేనట్టుగా వింత రోగం వచ్చింది. దీంతో తీవ్రంగా లాస్ అయినం. ప్రభుత్వం ఆదుకోవాలి.

–వెంకట్ పటేల్, రైతు, సుల్తాన్‌పేట్

ఇసుంటి రోగం ఎన్నడూ సూడలే



సోయాబీన్ పంటకు వింత వైరస్ వచ్చింది. ఇన్ని రోజులు పంట బాగుందని మురిసిపోయాం. దంటుకు బాగా కాత కాసింది. కాయలో గింజ నిండుకునే టైంలో పంటకు రోగం వచ్చింది. పూర్తిగా ఎండిపోతోంది. ఇసువంటి రోగం సోయాకు రావడం ఎన్నడూ సూడలేదు. పెట్టిన పైసలు కూడా వచ్చేటట్టు లేదు. సర్కార్ మా పరిస్థితిని చూసి ఆదుకోవాలి.

–రాజాబోయి, రైతు, సుల్తాన్‌పేట్

మొగి పురుగు నుంచి పంటలను కాపాడుకోవచ్చు

- జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి



పంటలను పరిశీలిస్తున్న అధికారి భాగ్యలక్ష్మి

కామారెడ్డి రూరల్: క్యాసంపల్లిలో బుధవారం జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి, ఏఈవో తేజస్వినిలు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాలలో ఎక్కువగా కాండం తొలిచే పురుగు ఆశిస్తోందని, ఇది నారుమడి దశలో ఆశిస్తే మొవ్వలు ఎండిపోయి చనిపోతాయన్నారు. అంకురం నుంచి చిరు పొట్ట దశలో ఆశిస్తే ఈ నెల తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయన్నారు. దీని నివారణకు కార్బోఫైరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. లేదా క్లోనిస్‌ట్రనిప్రోల్ 0.4 ఏ గుళికలు నాలుగు కేజీలు ఎకరానికి వెదజల్లాలన్నారు. రైతులు గనక ఈ జాగ్రత్తలు తీసుకుంటే మొగి పురుగు నుంచి పంటను కాపాడొచ్చని పేర్కొన్నారు. సకాలంలో కలుపుతీసి ఎకరానికి 20 కేజీల యూరియా మాత్రమే వెదజల్లుకోవాలన్నారు.

ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని వినతి



కామారెడ్డి టౌన్: తమ బిడ్డ మరణానికి కారణమైన జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు బుధవారం డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన అన్వేష్ సౌందర్యల 11 నెలల కుమారుడు అద్వంత్‌కు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేసి మరణానికి కారణమైన ఆస్పత్రి, వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

లారీని ఢీకొన్న బస్సు

- 8 మందికి స్వల్ప గాయాలు



ఘటనా స్థలిలో దెబ్బతిన్న బస్సు

కామారెడ్డి క్రైం: రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని రాజధాని బస్సు ఢీకొన్న ఘటన కామారెడ్డి సమీపంలోని టేక్రియాల్ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నుంచి 40 మంది ప్రయాణికులతో రాజధాని బస్సు హైదరాబాద్ వెళ్తోంది. టేక్రియాల్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న కంటెయినర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి రోడ్డుపక్కన నిలిపి ఉంచిన లారీని ఢీకొన్నది. ఈ ఘటనలో 8 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. పెను ప్రమాదం తప్పింది.

కామాంధ అధ్యాపకుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువు కామాంధుడి వేషం ధరించడంతో అభం శుభం తెలియని ఓ విద్యార్థినిని గర్భం దాల్చింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి చివరికి మోసం చేయడంతో కటకటాలపాలయ్యాడు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని గంగాస్థాన్‌లో నిర్వహిస్తున్న ఓ ఎంసెట్ కోచింగ్ సెంటర్‌లో 2019లో జాయిన్ అయింది. అందులో లెక్చరర్‌గా పనిచేస్తున్న సైదులు కోచింగ్‌కు వచ్చే విద్యార్థినిపై కన్నేశాడు. ఆమెను క్రమంగా లోబర్చుకునే ప్రయత్నం చేశాడు. ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి మోసం చేశాడు. దీంతో సదరు విద్యార్థిని గర్భం దాల్చింది. ఈ విషయమై లెక్చరర్‌ను నిలదీయగా పెళ్లి చేసుకుంటానని నాటి నుంచి దాటవేస్తూ వస్తున్నాడు. చివరికి పెళ్లిచేసుకోనని చెప్పడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు సైదులుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద గ్రామానికి చెందిన నీరుడి దుర్గవ్వ(35) కుటుంబ కలహాలతో ఈ నెల 18న పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. దుర్గవ్వకు వరంగల్‌కు చెందిన అజ్మల్‌పాషను ఇల్లరికం తీసుకొచ్చి పెళ్లి చేశారు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు. 2019లో దుర్గవ్వ గర్భిణిగా ఉన్నప్పుడు అజ్మల్‌పాష భార్యతో గొడవపడి పిల్లలను తీసుకొని వెళ్లిపోయాడు. 2020లో మరో బాబుకు జన్మనిచ్చిన దుర్గవ్వ తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. ఈ నెల 18న ఇంట్లో జరిగిన గొడవతో మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు మెదక్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకు 19న హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

భర్తపై హత్యాయత్నం

కమ్మర్‌పల్లి: ఓ మహిళ తన భర్తపై హత్యాయత్నం చేసి ప్రమాదంగా చిత్రీకరించి పోలీసులకు దొరికిపోయిన ఘటన కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనాపూర్‌కు చెందిన వేముల రాజు తన భార్య సుజాతను నిత్యం మద్యం సేవించేందుకు డబ్బులు కావాలని కొడుతూ వేధించేవాడు. బాధ భరించలేక సుజాత ఈ నెల 11న ఇంట్లో నిద్రిస్తున్న రాజుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టింది. ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నించింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజు పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. అనుమానంతో సుజాతను విచారించగా భర్తను హత్య చేయడానికి ప్రయత్నించినట్లు తేలింది. తన భర్త నిత్యం తాగడానికి డబ్బుల కోసం వేధిస్తున్నాడని కోపంతో ఈ ఘటన చేసినట్లు అంగీకరించింది. కేసు నమోదు చేసి నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహం లభ్యం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన గంగాధర్(45) మృతదేహం దేవాడ వాగులో లభ్యమైనట్లు ఎస్సై మురళి బుధవారం తెలిపారు. చెప్పులు గంగాధర్ చెప్పులు కుడుతూ జీవనం సాగించేవాడు. ఈ నెల16న దేవాడ, సిర్‌సముందర్ వెళ్తున్నాని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి విచారణ చేపట్టగా గంగాధర్ మృతదేహంగా పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



యాదయ్య మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిర్మన్‌పల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. మర్కల్ గ్రామానికి చెందిన దమాల యాదయ్య(40) గొర్లకాపరిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా తాగుకు బానిసకావడంతో జీవితంపై విరక్తితో గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): బర్దిపూర్ గ్రామానికి చెందిన మేకల జెల్లబోయికి నాలుగు నెలల క్రితం జరిగిన చోరీ కేసులో సాధారణ ఆరు నెలల జైలు శిక్ష, రూ. వంద జరిమానా విధిస్తూ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రుబీనా ఫాతీమా బుధవారం తీర్పు వెల్లడించారు. పీపీ సీహెచ్ రాణి తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలంలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన మేకల జెల్లబోయి నాలుగు నెలల క్రితం చోరీకి పాల్పడ్డాడు. కోర్టులో సాక్షాధారాలు రుజువు కావడంతో న్యాయమూర్తి ఆరు నెలల జైలు శిక్ష, రూ. వంద జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు తెలిపారు.

స్కూల్‌బస్ డ్రైవర్‌కు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని బైరాపూర్ తండాకు చెందిన అంబర్ సింగ్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు. నగరంలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న అంబర్‌సింగ్ మంచిప్ప నుంచి బాడ్సి, చిన్నాపూర్ మీదుగా బస్సును ప్రమాదకరంగా నడపడంతో విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారు బస్సును నిలిపివేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబర్‌సింగ్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పరీక్ష చేసి జడ్జి ముందు ప్రవేశపెట్టారు. పరీక్షలో మద్యం సేవించినట్లు రుజువు కావడంతో అంబర్‌సింగ్‌కు రెండురోజుల జైలు శిక్ష జడ్జి విధించినట్లు తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరంలోని శివాజీనగర్‌కు చెందిన ఆర్మూర్ లింగంపై దాడికి పాల్పడిన దేవేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము బుధవారం తెలిపారు. ఆర్మూర్ లింగం, శ్రీధర్, ప్రవీణ్ కల్లు సేవించేందుకు న్యాల్‌కల్ కల్లు డిపోకు వచ్చారు. అక్కడ దేవేందర్‌కు చెందిన బైక్ అడ్డుగా ఉండడంతో పక్కకు జరిపే విషయంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపంతో దేవేందర్ లింగంపై కల్లు సీసాతో దాడి చేశాడు. దాడిలో తల, చేతికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు దేవేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భిక్కనూరులో బంగారం చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఓ బంగారు దుకాణంలో బంగారం చోరీ జరిగిందని ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. బంగారు దుకాణ నిర్వాహకుడు రమేశ్‌చౌదరి హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో దుకాణంలో ఉన్న గుమాస్తాలు ఓ దంపతులకు చేతి వేలి బంగారం కోసం చూయించగా వారు కొనలేదని చెప్పారు. వారు దుకాణం నుంచి వెళ్లిన సమయంలోనే బంగారం కనిపించకుండా పోయిందని నిర్వాహకుడు తెలిపాడు. దుకాణ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్

జిల్లాలో వినాయక చవితిని ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. గణనాథులకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గణేశ్ విగ్రహాలతో తీసుకున్న సెల్ఫీలను 'సాక్షి'తో పంచుకున్నారు. – కామారెడ్డిటౌన్



అనిల్‌రెడ్డి, కామారెడ్డి



అమ్ములు, రుషి, షేర్‌గల్లీ, కామారెడ్డి



రాజశేఖర్, హౌజింగ్‌బోర్డు కాలనీ, కామారెడ్డి



స్నేహ, కామారెడ్డి



మానాల మౌనిక, విద్యుత్‌నగర్, దేవునిపల్లి



జంగం శ్రీశైలం, దేవివిహార్, కామారెడ్డి



వేదాంశ్ వర్ధన్, గాంధీనగర్, కామారెడ్డి

ఓటు వేయడంపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ మను చౌదరి



మద్నూర్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఓటు వేయడంపై అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని తహసీల్దార్లు, పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 1,92,059 ఓటర్లు ఉన్నారని ఇందులో పురుషులు 94,988, స్త్రీలు 97,061, ఇతరులు 10 మంది ఉన్నారని ఆయన తెలిపారు. 946 మంది ఓటర్లు మృతి చెందారని, 56 డూప్లికేట్ ఓట్లు, మరో 152 ఇతర కారణాలతో ఓట్లు తొలగించామని అదనపు కలెక్టర్ చెప్పారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది మొత్తం 64 వేల ఇళ్లకు వెళ్లి సర్వే చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎలక్టోరల్ మిషన్ ద్వారా ఓటు ఎలా వేయాల్లో అధికారులు అవగహన కల్పిస్తారన్నారు. అలాగే తహసీల్ కార్యాలయం వద్ద ఒక ఎలక్టోరల్ మిషన్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగహన కల్పిస్తామన్నారు. అక్టోబర్ 27న ఓటర్ లిస్ట్ ఫైనల్ పబ్లికేషన్ ఉంటుందని, అంతలోపల ఏవైనా అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: బీర్కూర్ మండలం చించొల్లిలో బుధవారం పలు అభివృద్ధి పనులకు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్పీకర్ పోచారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో ఎస్‌డీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు మంజూరు అయ్యాయని అన్నారు. రూ.15 లక్షలతో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ, రూ.15 లక్షలతో ఎస్సీ వాడ నుంచి పంట పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డుకు భూమి పూజ, రూ.10 లక్షలతో ధర్మశాల నిర్మాణానికి భూమిపూజ, రూ.10 లక్షలతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ, రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన మున్నూర్ కాపు సంఘం ప్రహరీని ప్రారంభించారు. అనంతరం కిష్టాపూర్ శివారులో విఠలేశ్వర మందిరానికి భూమి పూజ చేశారు. మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, ఎంపీపీ రఘు, చించొల్లి సర్పంచి బాబురావు, వైస్ ఎంపీపీ కాశీరాం తదితరులున్నారు.

'మేరీ మాటీ మేరా దేశ్' ప్రపంచానికే ఆదర్శం



జంగంపల్లిలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నేతలు

భిక్కనూరు: దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వీరులను తలచుకోవడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన 'మేరీ మాటీ మేరా దేశ్' ప్రపంచానికే ఆదర్శమని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జంగంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, అంతంపల్లి, రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కలశాలలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటినుంచి సేకరించిన మట్టితో దేశ రాజధానిలో అమృత్ వాటిక నిర్మిస్తారన్నారు. ఒక వైపు అయోధ్యలో రామమందిర నిర్మాణం, మరోవైపు స్మృతివనాలు ప్రధాని నరేంద్ర మోదీకి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు తెచ్చిపెడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నేతలు బస్వారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి, నర్సింలు, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి,రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోపై విచారణ

కామారెడ్డి టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై బుధవారం అదనపు కలెక్టర్ చంద్రమోహన్ విచారణ జరిపారు. ఆయన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫిర్యాదుదారు యువజన కాంగ్రెస్ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి ఐరేని సందీప్‌తో పాటు, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్‌ను ముఖాముఖీగా విచారించారు. సందీప్ నుంచి సాక్ష్యాలను తీసుకున్నారు. ఆధారాలు పరిశీలించిన తర్వాత పూర్తి విచారణ జరిపి, అవినీతికి పాల్పడినట్లు తెలితే డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు.

అడ్డుకునేందుకు యత్నం!

విచారణ నిమిత్తం ఆధారాలతో కలెక్టరేట్‌కు వచ్చిన ఐరేని సందీప్‌ను ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యారోగ్య శాఖలోని ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అడ్డుకునేందుకు యత్నించినట్లు తెలిసింది. సదరు ఉద్యోగి మొదట బతిమాలి వెనక్కి పంపించాలని చూశారని సమాచారం. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద పలువురిని ఉంచి, సందీప్‌తో గొడవ పెట్టుకునేందుకూ యత్నించినట్లు తెలిసింది. దీంతో విచారణ అనంతరం బయటకు వచ్చిన సందీప్‌ను పోలీస్ బందోబస్తుతో బయటకు తీసుకువచ్చి ఇంటికి పంపించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి టోకరా

కామారెడ్డి క్రైం: లక్కీడ్రాలో విలువైన మొబైల్ ఫోన్ గెలుచుకున్నారని నమ్మించిన ఆన్‌లైన్ మోసగాళ్లు ఓ సాఫ్ట్‌వేర్ యువతికి రూ.50 వేలకు టోకరా వేసిన ఘటన జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్‌లో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఈనెల 16న గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి లక్కీడ్రాలో మొబైల్ గెలుచుకున్నారని నమ్మించారు. జీఎస్టీ కింద తిరిగి చెల్లించబడే రూ.50 వేలు జమ చేయాలని సూచించారు. వారు చెప్పినట్టుగానే చేసిన సదరు యువతి మోసపోయినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులను ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

గంజాయి అమ్మితే పీడీ యాక్ట్

ఖలీల్‌వాడి: గంజాయి అమ్ముతూ పట్టుబడితే పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్ తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు ఆర్మూర్ పరిధిలోని అన్ని గామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కమ్మర్‌పల్లిలో ముగ్గురు, మెండోరాలో ఒకరు, ముప్కాల్‌లో ఇద్దరి నుంచి 300 గ్రాములు చొప్పున గంజాయి స్వాధీనం చేసుకొని వాటిని సీజ్‌చేసి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

నాటు సారా స్వాధీనం

మాచారెడ్డి: మండలంలోని సిక్కులోని లొద్ది తండాపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడి చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో తండాకు చెందిన మేనిక, జవహర్ ఇంట్లో నిల్వ ఉంచిన 40లీటర్ల ఇప్ప పువ్వు పానకాన్ని ధ్వంసం చేసి నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు కామారెడ్డి టాస్క్ ఫోర్స్ సీఐ సుందర్‌సింగ్ తెలిపారు. వీరితో పాటు గతంలో ఎక్సైజ్ కేసులు నమోదైన మరో 18 మందిని తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. దాడిలో ఎస్సై విక్రమ్ కుమార్, సిబ్బంది సిద్ధిరాములు, మారుతి, శ్రీకాంత్, గణపతి, సరిత, రమ ఉన్నారు.

మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: లింగంపేట మండలం సజ్జన్‌పల్లికి చెందిన మూగూరి పోచవ్వ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేశ్ బుధవారం తెలిపారు. పోచవ్వ నిత్యం గ్రామస్తులతో కలిసి జిల్లా కేంద్రంలోని లేబర్ అడ్డాకు వచ్చేదని తెలిపారు. ఈనెల 19న తోటివారితో కలిసి ఆటోలో కామారెడ్డికి వచ్చింది. లక్ష్మాపూర్‌లో ఇద్దరు మహిళలతో కలిసి కూలీ పనికి వెళ్లినట్లు ఫోన్‌లో భర్తతో తెలిపింది. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల గాలించారు. పోచవ్వ భర్త కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.